పెండింగ్ పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

కడప : ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం-6,7,8 అర్జీల పెండెన్సీతో పాటు అన్ని రకాల పెండింగ్ పనులను నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డ్ మీటింగ్ హాలులో ఓటరు జాబితా పెండింగ్ ఫారాలు, కాస్ట్ సర్వే, జెజిఎవి పనులు, ఆరోగ్య సురక్ష, ఆరోగ్య శ్రీ కార్డ్, ఏపీ సర్వేసన్, హౌసింగ్, జగనన్న ఆరోగ్య సురక్ష, జగనన్నకు చెబుదాం, వివిధ సంక్షేమ పథకాలపై నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్‌తో కలిసి మండల అధికారులతో కలెక్టర్ విసి ద్వారా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలాంటి అలసత్వం వహించకుండా ప్రజలకు అందించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి అన్ ప్రాసెసెడ్ అర్జీలను పెండింగ్ లేకుండా ఏ రోజుకు ఆరోజు బిఎల్ఒలకు అలికేట్ చేసి వాటిని పూర్తి చేయాలన్నారు.

జమ్మలమడుగులో అంతర్గత పోరు!

- అబ్బాయికి బాబాయ్ స్ట్రోక్
- పొత్తు పేరుతో త్యాగంపై డైలమా?
- గెలుపు అవకాశాలు గల్లంతు
- టిడిపి కేడర్‌లో అయోమయం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జమ్మలమడుగు టిడిపిలో అంతర్గత సంక్షోభం నెలకొంది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా నిలవనున్న భూపేష్‌రెడ్డిని ఆదరించాలని టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు గత జిల్లా పర్యటన సందర్భంగా విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. చంద్రబాబు ఇచ్చిన డైరెక్షన్‌తో భూపేష్‌రెడ్డి తనదైన శైలిలో నియోజకవర్గ వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టి ప్రజల మద్దతు సంపాదించుకునే ప్రయత్నాల్ని వేగవంతం చేశారు. ఒకవైపు పాదయాత్ర, మరోవైపు టిడిపిలోనికి వైసిపి నాయకులను, కార్యకర్తలను, మద్దతుదారులను, తటస్థులను విశేషంగా ఆకర్షించే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఫలితంగా 15 రోజుల కిందట ముద్దనూరులో టిడిపిలోకి చేరికల సందర్భంగానే టిడిపి, వైసిపి కార్యకర్తలు, నాయకుల మధ్య హోరాహోరీ పోరాటం నడిచిన సంగతి తెలిసిందే. నియోజకవర్గ పరిధిలోని జమ్మలమడుగు, ముద్దనూరు, కొండాపురం, మైలవరం మండలాల మీదుగా సాగిన పాదయాత్ర సందర్భంగా ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిని గెలిపిస్తే గండికోట నిర్వాసితుల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానని, ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి కృషి చేస్తానని, సిమెంటు పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపుతానని, ఫలితంగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తానని హామీలను ఇస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. తనదైన విజన్‌తో స్పష్టమైన వైఖరితో ముందుకెళ్తున్న నేపథ్యంలో కేడర్‌లో ఉత్సాహం నెలకొంది. ఫలితంగా 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి సాధించిన 52 వేలకుపైగా భారీ మెజార్టీని అధిగమించి గెలుపు సాధిస్తామనే భరోసాతో కూడిన వాతావరణం కలిగించడంలో కృతకృత్యులయ్యారు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో టిడిపి, బిజెపి, జనసేన పొత్తు ధర్మంలో భాగంగా బిజెపి తరుపున ఆయన బాబాయ్ మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి బరిలో నిలిచే అవకాశాలు ఉన్నాయనే ఊహాగానాలు జోరందుకోవడం కేడర్‌లో నిరుత్సాహాన్ని కలిగిస్తోంది. టిడిపి అధిష్టానం సైతం బిజెపితో పొత్తు కోసం అర్రులు చాస్తున్న నేపథ్యంలో కేడర్‌లో డైలమా వాతావరణం నెలకొంది. రెండు నెలలుగా పకడ్బందీ ప్రణాళికతో సాగుతున్న వ్యూహాత్మక రాజకీయానికి బ్రేకులు వేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో నాలుగు పంచాయతీలు, రెండు ఎంపిటిసిలను బిజెపి దక్కించుకుంది. ఇటువంటి అసెంబ్లీ స్థానంలో బిజెపి తరుపున ఎమ్మెల్యే అభ్యర్థిగా బాబాయ్ బరిలో నిలవనున్నట్లు సమాచారం. టిడిపి ఓటర్లు బిజెపి ఎన్నికల గుర్తు కమలం వైపు మళ్లించడం సాధ్యమయ్యేనా అనేదానిపై వాదన వినిపిస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 52 వేల ఓట్లకుపైగా భారీ మెజార్టీతో టిడిపి అభ్యర్థి ఓటమి పాలైన నేపథ్యంలో మరోసారి పోటీ చేయడం ద్వారా ఎటువంటి ప్రయోజనమూ ఉండదనే వాదన వినిపిస్తోంది. పొత్తు ధర్మంలో భాగంగా జిల్లాలో టిడిపి గెలిచే అవకాశం కలిగిన జమ్మలమడుగు అసెంబ్లీ స్థానాన్ని త్యాగం చేయనుందనడం పట్ల కేడర్‌లో ఆందోళన నెలకొంది. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలైన జమ్మలమడుగులో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటును నిరాకరించింది, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ నిధులిచ్చి వెనక్కి తీసుకోవడం, కర్నూలులో హైకోర్టు ఏర్పాటును కూడా నిరాకరించడం, రాయలసీమ డిక్లరేషన్ పేరుతో హడావుడి చేసిన సంగతి తెలిసిందే. కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో కొనసాగుతూ జిల్లాకు, రాయలసీమ, రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపికి అసెంబ్లీ టికెట్ త్యాగం చేయడం సరికాదనే వాదన వినిపిస్తోంది.

కాశినాయన ఆలయాన్ని కూల్చొద్దు

అడ్డుకున్న స్థానికులు - వెనుదిరిగిన అధికారులు

స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-కాశినాయన

జ్యోతి క్షేత్రంలో ఉన్న కాశినాయన ఆలయాన్ని పడగొట్టవద్దని ఆర్‌డిఒ, పోలీసు, అటవీశాఖ అధికారులకు ప్రజలు, వైసిపి నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి కోరారు. సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీ శాఖ అధికారులు బద్వేల్ ఆర్‌డిఒ పోలీస్ అధికారులు కాశినాయన జ్యోతి క్షేత్రానికి వెళ్లారు. ఆలయానికి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో నిర్మాణపు పనులు చేయవద్దని, నిర్మాణాలు తొలగించాలని తమకు ఉత్తర్వులు వచ్చాయని అధికారులు చెప్పారు. అక్కడ ఉన్న ఆలయాన్ని తొలగించేందుకు ప్రయత్నించడంతో ఇంతలో ఆలయ కమిటీ, విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో జనాలు అక్కడికి చేరుకున్నారు. అధికారులకు రెండు చేతులు జోడించి తమ విన్నపాన్ని ఆలకించి ఆలయంజోలికి రావద్దని మొరపెట్టుకున్నారు. డిఎఫ్ఒ సందీప్ రెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చామని, అనుమతులు లేకపోవడం వల్ల ఆలయపు నిర్మాణ పనులు చేయవద్దని చెప్పారు. అవసరమైతే పైస్థాయికి వెళ్లి అనుమతులు తెచ్చుకోవాలన్నారు. స్పందించిన విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ అనుమతికి సంబంధించిన ఫైలు ఎంపీ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీ వరకు ఫైలు వెళ్లిందని, రేపో, మాపో అనుమతి వస్తుందని ఆశపడ్డామని, ఇంతలోనే అధికారులు రావడం ఆశ్చర్యానికి గురవుతున్నామని తెలిపారు. దయచేసి ఆలయం జోలికి రావద్దని, త్వరలోనే ఆలయానికి అనుమతి తెచ్చుకుంటామని, కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల విన్నపాలకు అధికారులు వెనుతిరగక తప్పలేదు. కార్యక్రమంలో సబ్ డి ఎఫ్ సుధాకర్, ఆర్‌డిఒ వెంకట రమణ, ఎఫ్ఆర్ఒ ప్రణీతరావు, తాసిల్దార్ వి. ఎన్. వి. ఆర్ కృష్ణ, ఎస్ఐ నాగమురళి, ఎఫ్ఎస్ఒ రమణయ్య ఎఫ్‌బిఒ కరుణాకర్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు

175 స్థానాల్లో గెలుపే లక్ష్యం : వైసిపి

ప్రజాశక్తి-చెన్నూరు

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా వైసిపి అధిష్టానం ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని వైసిపి మండల కన్వీనర్ జీవన్ భాస్కర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వై నాట్ 175 అన్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాల మేరకు మనందరం కలిసి పనిచేయాలన్నారు. ఇటీవల కమలాపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో చేరికలను ఆ పార్టీ నాయకులు బలం అనుకుంటున్నారని అది వాపు అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని విమర్శించారు. టిడిపిలో చేరిన వారందరూ వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీకి చాలకాలంగా దూరంగా ఉన్నవారేనని వారి వల్ల పార్టీకి ఎటువంటి నష్టం జరగదని ఆయన అన్నారు. మంచి జరిగితేనే తమ పార్టీని ఆశీర్వదించాలని చెప్పిన ఏకైక నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి రెండవసారి ముఖ్యమంత్రి కావడం, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తిరిగి 50 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపిపిచీర్ల సురేష్ యాదవ్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, అల్లి శ్రీరామ్మూర్తి, అన్వర్ బాష, అబ్దుల్ రబ్, టిఎన్ చంద్రారెడ్డి, పిచ్చయ్య, గుమ్మల మధుసూదన్ రెడ్డి, ఎర్ర సాని మోహన్ రెడ్డి, రామాంజనేయులు, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

కాశినాయన : మండలకేంద్రంలోని నరసాపురంలో ఏర్పాటు చేసిన తెలుగు దేశం పార్టీ కార్యాలయాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో బద్వేల్ కార్యనిర్వాహక కార్యదర్శి నాగరాజు, టిడిపి నాయకులు రాజారెడ్డి, గంగనపల్లి రవీంద్రారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, బాలరాజుపల్లి రవీంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, గోంటువారిపల్లి, రామసుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు

ఘనంగా మొదటి వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్

కొత్తగా ఆలోచిస్తూ దేశ యువతకు తమవంతుగా కృషి చేస్తున్న జెబివిఎస్‌ది ప్రెసెర్వర్ సేవా సమితి మొదటి వార్షికోత్సవాన్ని సోమవారం శ్రీహరి డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ హాజరై మాట్లాడారు. సమాజం లో జెబివి ఎస్ ది ప్రెసెర్వర్ సేవా సమితి బృందం చేస్తున్న అనేక కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత సుమారు 750 మంది తో రక్త దానం చేయించడం సంస్థ సాధించిన ప్రగతి అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ చెన్నకేశవ మాటాడుతూ శివాజీ మహారాజ్ పుట్టిన రోజున ఈ ఆర్గనైజషన్ ప్రారంభించి అనేక కార్యక్రమాలను చేయడం సంతోషమన్నారు. సంస్థ వ్యవస్థాపకులు, ఎన్ఎస్ఎస్. వాలంటీర్ అశోక్ మాట్లాడుతూ ఈ ఏడాది 150 అభాగ్యులకు అన్నదానం, వృద్ధాశ్రమాలలో 110 పైగా అన్నదనాలు చేశామని తెలిపారు. 50 పైగా దుప్పట్ల పంపిణీలు, మూగ జీవులకు ఆహారం అందించడం, ఉచితంగా బ్లడ్ గ్రూపింగ్,రక్తదాన శిబిరాలు, చలివేంద్రాలు ఏర్పాటు, జాతీయ అంతర్జాతీయ దినోత్సవాలు ఘనంగా జనిర్వహించామన్నారు. నెల్లూరు వరద బాధితులకు సుమారు 90 కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందించామని చెప్పారు. అనంతరం వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు అతిథులు మెమెంటోస్, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎసిపిఒ ఆనంద్ కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, సంస్థ సభ్యులు ఆయేషా, మహిమ, సల్మాన్, సోహెబ్, అశోక్, విజయ్ పాల్గొన్నారు.

తెలుగు భాషకు తిలోదకాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగు బోర్డు ఆంగ్లంలో ఉండడాన్ని పరిశీలిస్తున్న తవ్వా వెంకటయ్య

అధికార భాషగా తెలుగు అమలు తీరు పరిశీలనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య సోమవారం కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాలను సందర్శించారు. కళాశాలలో ప్రతి శాఖ పేరు ఆంగ్లంలోనే ఉండడాన్ని గమనించారు. ప్రధానంగా తెలుగు శాఖ పేరు కూడా తెలుగులో రాయకుండా ఆంగ్లంలో రాయడాన్ని తప్పుపట్టారు. తెలుగు శాఖలో రికార్డులు, తెలుగు శాఖలో పనిచేస్తున్న అధ్యాపకుల పేర్లు కూడా ఆంగ్లంలోనే రాయటం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. కళాశాల గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడ కూడా రికార్డులు, పుస్తకాల పేర్ల సూచికలు అన్ని ఆంగ్లంలోనే ఉన్నాయని, వాటిని మార్చుకోవాలని చెప్పారు. కళాశాలలోని అన్నిశాఖలకు చెందిన ఫలకాలు అంగ్లంలోనే ఉన్నాయని , ముఖ్యంగా ప్రధాన ద్వారం దగ్గర ఏర్పాటు చేసిన కళాశాల పేరు కూడా ఆంగ్లంలోనే ఉండడం సమంజసం కాదన్నారు. కళాశాల ప్రధానాచార్యులు (ప్రిన్సిపల్) తెలుగు భాషను పూర్తిగా విస్మరించి, తిలోదకాలు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలో తెలుగు 5 శాతం కూడా అమలు కావడం లేదన్నారు .

నేడు ఎపి జెఎసి ఉద్యోగుల మహాధర్నా

కడప అర్బన్ : ఎపిజెఎసి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా జెఎసి చైర్మన్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహావీర్ సర్కిల్ నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద ఉదయం 10.30 గంటల నుంచి మహా ధర్నా ప్రారంభమవుతుందని తెలిపారు. ఎపి జెఎసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ, ఎన్‌జిఒ ప్రధాన కార్యదర్శి కె. వి. శివారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లా అన్ని తాలూకాలు, నగరంలో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక, వార్డు, సచివాలయం,ఉద్యోగులు, పెన్షనర్లు హాజరై మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

వైవీయూలో పరీక్షా కేంద్రం తనిఖీ

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న పీజీ మొదటి సంవత్సరం పరీక్షల కేంద్రాలను విసి ఆచార్య చింతా సుధాకర్ సోమవారం తనిఖీ చేశారు. విసి ఆచార్య సుధాకర్, రిజిస్టర్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య , ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డితో కలిసి విశ్వవిద్యాలయ ఆర్ట్స్ బ్లాక్‌కు వచ్చారు. పరీక్షల నిర్వహణ పై పర్యవేక్షణ అధికారులతో మాట్లాడారు. కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి విద్యార్థుల హాల్ టికెట్లు తనిఖీ చేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

కడప అర్బన్ : నగరంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఎం సి సి పుట్లంపల్లి, ఎంఆర్ఎఫ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ఉఖాయిపల్లి గార్బేజ్ ట్రాన్సల్ స్టేషన్, వినాయక నగర్ ప్రాంతాలలో పనులను శానిటేషన్ విభాగ అధికారులు, ఇంజినీరింగ్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. పుట్లంపల్లిలో మైక్రో కంపోస్ట్ ప్రాసెస్‌ను మొదలు పెట్టాలని అధికారులకు సూచించారు. 10 టన్నుల మైక్రో కంపోస్ట్ ఎరువు తయారు చేసేలా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా శానినిటేషన్ విభాగా అధికారులకు ఆదేశించారు.

రహదారుల భద్రతలో సామాజిక బాధ్యత వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

విద్యార్థికి సర్టిఫికేట్ అందజేస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో ట్రాఫిక్ నిబంధనలతో పాటు తల్లిదండ్రులు కూడా సామాజిక బాధ్యత వహించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని విపి హాలులో జిల్లా రవాణా శాఖ డిటిసి మీరా ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన 35వ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో జనవరి 20 నుంచి ఫిబ్రవరి 19 వరకు రవాణా శాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన 'జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు'లో భాగంగా ఆ శాఖ అధికారులు నిర్వహించిన పలు అవగాహన కార్యక్రమాలతో ప్రజల్లో ముఖ్యంగా యువతలో మరింత అవగాహన పెరిగి ఉంటుందని విశ్వసించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించిన ప్రభుత్వ సూచనలపై ప్రజల్లో అవగాహన కలిగి ఉండాలన్నారు. రోజూ ఉదయం సంతోషంగా ఇంటి నుండి బయటకు వచ్చిన వ్యక్తి, వారి విధులు ముగించుకుని సాయంత్రం తిరిగి అదే సంతోషంతో సురక్షితంగా ఇంటికి చేరుకోవాలన్నారు. ఒక కుటుంబంలో సంపాదనపరుడు రహదారి ప్రమాదంలో మరణించినట్లయితే ఆ కుటుంబం పేదరికం నుంచి బయటపడటానికి ఒక తరం కాలం పడుతుందని, ప్రతి ఒక్కరు కూడా రహదారి నియమాలపై కనీస అవగాహన పెంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చోటు చేసుకునే అనర్థాలు, ప్రమాదాలు, ప్రాణ నష్టం.. తద్వారా కుటుంబంలో వ్యక్తులను కోల్పోతే ఎదురయ్యే పరిస్థితులను తల్లిదండ్రులు తమ పిల్లలకు తెలియజేయాలన్నారు. పిల్లల్లో సామాజిక విలువలను నేర్పించినపుడే ప్రాణం విలువ తెలియడంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. డిటిసి మాట్లాడుతూ రోడ్ల భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహన యజమానులు, వాహన డ్రైవర్లు, ప్రజలు. విద్యార్థులకు రహదారి భద్రత, రోడ్ సేఫ్టీ ఆడిట్ మొదలగు విషయాలపై వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించామన్నారు. ప్రజా రవాణా వ్యవస్థలో డ్రైవర్లు మితిమీరిన వేగంతో, నిర్లక్ష్యంతో వాహనాలు నడపడం ఎంత ప్రమాదకరమో వివరించారు. అనంతరం రహదారి భద్రత కోసం కృషి చేసిన అధికారులకు, సంస్థలకు జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందించారు. రహదారి భద్రతపై రవాణా శాఖ వారు విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ , వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో ప్రథమ, ద్వితీయ, మరియు తృతీయ స్థానాలు పొందిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఈడి (జోన్-4) వెంకటేశ్వరరావు, ఆర్అండ్‌బి ఎస్ఇ. మహేశ్వర్ రెడ్డి, ఆర్టీవో మురళీధర్, ఎంవిఐ విజయ్ భాస్కర్, ఎఎంవిఐలు లక్ష్మీ ప్రసన్న, అన్ని శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రవాణా శాఖ కానిస్టేబుల్స్, హోంగార్డ్స్, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ సిఇగా మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

ఎట్టకేలకు ఇరిగేషన్ చీఫ్ ఇంజినీరుగా ఎం.మల్లికార్జునరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం ప్రభుత్వం ఆయనకు ప్రమోషన్ కల్పిస్తూ. జీవోను జారీ చేసింది. సూపరింటెండెంట్ ఇంజినీరుగా ప్రమోషన్ కల్పించిన అనంతరం ఎఫ్ఎసిగా చీఫ్ ఇంజినీరు బాధ్యతలను అప్పగించినట్లు సమాచారం. ఈ ఏడాది జనవరి నెలాఖరున చీఫ్ ఇంజినీరు కె.హరినారాయణరెడ్డి ఉద్యోగ విరమణ చేసిన సంగతి తెలిసిందే. అదేరోజునే సిఇ ఖాళీని భర్తీ చేయాల్సి ఉంది కానీ సాంకేతిక కారణాల పేరుతో సుమారు నెల రోజులుగా చీఫ్ ఇంజినీరు నియామకాన్ని చేపట్టకపోవడం గమనఆర్హం. రాష్ట్రంలోని కడప ఇరిగేషన్ జోన్‌లో వేల కోట్ల రూపాయలతో కూడిన అభివృద్ధి పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇటువంటి వరిస్థితుల నేపథ్యంలో ఆలస్యంగానైనా సిఇ నియామకాన్ని చేపట్టడం ఆహ్వానించదగిన విషయమని చెప్పవచ్చు.

విద్యుత్ కోతలను నివారించాలని నిరసన

కడప అర్బన్ : జిల్లాలో విద్యుత్ కోతలతో పంటలు ఎండుతున్నాయని, వెంటనే నివారించి నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేశారు. అనంతరం స్పందనలో విద్యుత్ ఎస్ఇ కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉద్యానవన పంటలు అరటి, ఆకుతోటలు, చీని, బొప్పాయి, నువ్వు, వేరుశనగ, వరి పంటలు బోర్ల కింద సాగు చేశారని తెలిపారు. విద్యుత్ కోతలతో పంటలకు నష్టం వాటిల్లుతుందని చెప్పారు. 9 గంటలు వస్తున్న విద్యుత్ ప్రస్తుతం 7 గంటలు వస్తుందని పేర్కొన్నారు. అదీ ఎప్పుడు పడితే అప్పుడు కోత విధిస్తున్నారని వాపోయారు. కోతలపై మండల విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సికె దిన్నె మండలాన్ని ప్రత్యేక దృష్టిలో ఉంచుకుని 9 గంటలు విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, నాయకులు చిన్న సిద్దయ్య, రమణ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రంగారెడ్డి, వీరయ్య పాల్గొన్నారు.

మునక ప్రాంత వాసులకు పట్టాలు ఇవ్వాలి : సిపిఎం

గోపవరం : బద్వేల్ నియోజకవర్గంలోని అట్లూరు. గోపవరం మండలాల్లోని సోమశిల మునక ప్రాంత వాసులకు ఇంటి స్థలాలు, భూములు ఇవ్వాలని బద్వేల్ రూరల్ సిపిఎం మండల కార్యదర్శి డి. వెంకటేశ్ డిమాండ్ చేశారు. సోమవారం అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అట్లూరు మండలంలోని ఎస్. వెంకటాపురం, రంగంపల్లె, చలం గారి పల్లె, ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు చెందిన మునక ప్రాంత వాసులకు ఇంటి స్థలాలు. భూములు ఇవ్వాలన్నారు. గతంలో రంగం పల్లెకు చెందిన సుమారు 80 మంది దళితులకు సర్వే నంబర్ 1779 లో డికెటి పట్టాలు ఇచ్చారని, కొందరు కలెక్టర్ అనుమతి లేకుండామూడు సెంట్లు స్థలాన్ని రెండు సెంట్లు మార్చుకొని దొంగ అనుబంధ పారాలను సృష్టించుకుని కబ్జా చేశారని వాపోయారు. గోపవరం మండలం మునక ప్రాంతవాసులకు సర్వే నెంబర్ 1663, 1662 లలో పిపి కుంట వద్ద ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జయరాజు, రాంబాబు, ఓబులేష్, అట్లూరు మండలం నాయకులు లక్ష్మీదేవి, అంజనమ్మ, సుబ్బమ్మ, గోపవరం మండలం సిపిఎం సీనియర్ నాయకులు కదిరయ్య, నరసింహులు, నరసయ్య పాల్గొన్నారు.

భారీ స్కోరు దిశగా రైల్వే జట్టు

కడప : వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో సికె నాయుడు ట్రోఫీలో భాగంగా సోమవారం ఆంధ్ర, రైల్వేస్ జట్ల మధ్య మ్యాచ్ రసవత్తరంగా సాగుతుంది. 7 వికెట్ల నష్టానికి 372 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 93.5 ఓవర్లలో 378 పరుగులకు ఆల్ అవుట్ అయింది. రైల్వేస్ జట్టులోని జైస్వాల్ 3, కుమార్ 3, దమన్ దీప్ సింగ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన రైల్వేస్ జట్టు ఆట ముగిసే సమయానికి 84.0 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 334 పరుగులు చేసింది. ఆ జట్టులోని రవి సింగ్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు. చిచ్చరపిడుగుల చెలరేగి ఆడుతున్నాడు. 211 బంతులను ఎదుర్కొని 10 బౌండరీలు, 13 సిక్సర్ల సహాయంతో 196 పరుగులు (నాట్ అవుట్) చేశాడు. మరో బ్యాట్స్‌మెన్‌అన్స్ యాదవ్ 274 బంతులను ఎదుర్కొని 8 బౌండరీలు సహాయంతో 120 పరుగులు (నాటౌట్) చేశాడు. ఆంధ్ర జట్టుకు చెందిన సంతోష్ కుమార్ చెన్నారెడ్డి లు ఒక్కో వికెట్ తీసుకున్నారు.

అభివద్ధిపై చర్చకు సిద్ధమా? : టిడిపి

కడప అర్బన్ : తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన అభివద్ధి, ఇప్పటి వైసిపి ప్రభుత్వం చేసిన అభివద్ధిపై అధికార పార్టీ ఎమ్మెల్యేలు చర్చకు సిద్ధమా అని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. సోమవారం ద్వారకా నగర్‌లోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అబద్ధపు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి హామీలు నెరవేర్చలేదని పేర్కొన్నారు. పేదలు ప్రమాదవశాత్తు మరణిస్తే, చంద్రన్న బీమా, ఇన్సూరెన్స్ ద్వారా రూ.5 లక్షలు ఇచ్చేదని, పండుగలు సంతోషంగా పేదలు జరుపుకోవాలని పండుగ కానుకలు ఇచ్చిందని తెలిపారు. రూ.5 కే అన్నా క్యాంటీన్ ద్వారా పేదల కడుపు నింపింది చంద్రబాబు అని గుర్తు చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక పేదల సంక్షేమ పథకాలన్ని నిలిపి వేసిందని, అన్నా క్యాంటీన్ పేరులో అన్నా అని ఉండడం జీర్ణించుకోలేని జగన్ రాజకీయ కక్షతో అ క్యాంటీన్లను రద్దుచేసి, కూల్చివేసి పేదలకు తీరని ద్రోహం చేశారని విమర్శించారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీ విజయ ఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ రాష్ట్ర నాయకులు గోవర్ధన్, నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

వాలంటీర్ వ్యవస్థ ఆదర్శనీయం

- ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప

గ్రామ, వార్డు సచివాలయ సేవలతో ప్రభుత్వ పరిపాలనలో నూతన వరవడి సృష్టించిందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాషాఅన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ గ్రౌండ్‌లో మున్సిపల్ పరిధిలోని వార్డులకు సంబంధించి సచివాలయ వార్డు వాలంటీర్ల సేవా పురస్కారాల ప్రధానోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్‌బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను మన రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వాలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజల గడపకు చేరుస్తున్న మానవతా మూర్తులు వాలంటీర్లని కొనియాడారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను కుల, మత,పార్టీ లకతీతంగా ప్రతిభ చూపిన వాలంటీర్లను గుర్తించిన ప్రభుత్వం సేవా మిత్ర, సేవ రత్న, సేవా వజ్ర పేర్లతో సత్కరిస్తోందన్నారు. నగర డిప్యూటీ మేయర్స్ బండి నిత్యానందరెడ్డి, ముంతాజ్ బేగం లు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలకు సేవలందించడంలో ప్రతిభ చూపిన ఆయా వార్డు లకు సంబంధించి ఐదుగురికి సేవ వజ్ర, 15 మందికి సేవా రత్న 1596 మంది వాలంటీర్లను అభినందిస్తూ సేవా మిత్ర పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ రాకేష్ చంద్ర, కార్పొరేటర్లు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఇబ్రహీం మియా, వైసిపి నాయకులు ఎస్. బి. అహమ్మద్ బాషా, అఫ్జల్ ఖాన్, నారపురెడ్డి సుబ్బారెడ్డి, వార్డు సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

25న భూతపురి 87వ జయంతి

కడప అర్బన్ : 'మహాకవి' 'శతావధాని' డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహిత్యపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 25న భూతపురి 87వ జయంతి, 22వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, కార్యదర్శి డాక్టర్ భూతపురి శివరామ సురేంద్ర శర్మ తెలిపారు. 25న ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం విసి ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్ సభాధ్యక్షులుగా, యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు. డాక్టర్ భూతపురి 22వ స్మారక సాహిత్య పురస్కారాన్ని ప్రసిద్ధ కవి, విమర్శకులు, గ్రంథ పరిష్కర్త వైద్యం వేంకటేశ్వరాచార్యులుకు అందజేయనున్నామని, ఆయన్ను రూ.10,116/- నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరిస్తామని తెలియజేశారు.

శ్రీనివాసులురెడ్డికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కడప



శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న వికాస్ హరి

కడప జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన రెడ్డప్ప గారి శ్రీనివాసులు రెడ్డిని సోమవారం టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, టిడిపి తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మడక చక్రధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసులు రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో పార్టీ విజయం కోసం తామందరం తప్పకుండా పనిచేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

కడప : వివిధ కారణాలతో ఇళ్లస్థలాలకు దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 26 వరకు గడువు ఇచ్చామని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన జర్నలిస్టుల నుండి వెబ్ సైట్ లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన వెల్లడించారు. వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తూ అక్రిడిటేషన్ కార్డు కలిగిన అర్హులైన జర్నలిస్టులకు హౌసింగ్ స్కీమ్ కింద ఇంటి స్థలాలను అందించేందుకు ఇప్పటికే ప్రభుత్వం జీవో నంబర్ 535ను జారీ చేసిందని గుర్తు చేశారు. www.ipr.ap.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వాలను గద్దెదించండి : కాంగ్రెస్

కాశినాయన : దేశంలో మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాలను ప్రజలు గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.డి.విజయ జ్యోతి అన్నారు. సోమవారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గిస్తామని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి ఐదేళ్లల్లో ఒక్కసారి అయినా ప్రశ్నించే దమ్ము లేకుండా పోయిందన్నారు. దేశంలో బిజెపి కుల, మత చిచ్చులు పెడుతూ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గద్దె దిగాలంటే ప్రజలు ఓటును హస్తం గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు.

అదుపుతప్పి స్కూల్ వ్యాన్ బోల్తా

- ఆరుగురు విద్యార్థులకు గాయాలు

వల్లూరు : మండల పరిధిలోని అంబవరం రోడ్డులో అదుపుతప్పి భాష్యం స్కూల్ వ్యాన్ బోల్తా పడింది. వ్యాన్‌లో 25 మంది విద్యార్థులు ఉండగా ఆరుగురికి గాయాలయ్యాయి. సోమవారం ఎస్ఐ వెంకటరమణ అందించిన వివరాల మేరకు కడప నగరంలోని భాష్యం స్కూల్ వ్యాన్ సాయంత్రం విద్యార్థులను ఇంటి వద్ద దింపేందుకు వస్తున్న సమయంలో అదుపుతప్పి బోల్తా పడింది అన్నారు. గాయపడిన విద్యార్థులను కడప రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

పనులు ప్రారంభిస్తున్న వైసిపి జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి, అధికారులు

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - ఖాజీపేట

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా గ్రామీణ రహదారులకు మోక్షం చేకూరుతోంది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి నోచుకుంటున్నాయి. మైదుకూరు నుంచి ఖాజీపేట మండలం బి.కొత్తపల్లె, తిప్పాయిపల్లె, బక్కాయపల్లె మీదుగా ముత్తులూరుపాడు వరకు రోడ్డు వేయనున్నారు. ఇందుకు దాదాపు రూ.మూడు కోట్ల నలభై లక్షల అంచనా వ్యయంతో నూతన రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పనులను వైసిపి జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బమ్మ, వార్డ్ సభ్యులు తవ్వా పెద్ద ఓబుల్‌రెడ్డి, పంచాయతీ రాజ్ డిఇ మల్లేశ్వర్‌రెడ్డి, ఎఇ రాఘవేంద్ర రెడ్డి, కాంట్రాక్టర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - మైదుకూరు

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. సోమవారం నెహ్రూ యువ కేంద్రం, అమ్మ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బద్వేల్ రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు, భద్రత యువత చేతిలో ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించి, సమర్థవంతమైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని కోరారు. విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అమ్మ సేవా సమితి అధ్యక్షులు వాగ్దాడం శివశంకర్, జన విజ్ఞాన వేదిక జిల్లా సాంస్కృతిక కన్వీనర్ ఖాజా హుస్సేన్, మోతే ఉపేంద్ర, నెహ్రూ యువ కేంద్ర వాలంటరీ సురేంద్ర, కళాశాల అధ్యాపకులు చంద్రమోహన్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

ప్రతిభావంత ఉద్యోగులకు ప్రోత్సాహకాలు

- పోస్టల్ సూపరింటెండెంట్ జి.కిరణ్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు డివిజన్ తపాలా శాఖ ఇండియా పోస్టల్ పేమెంట్ బ్యాంకులో ప్రతిభ చూపిన గ్రామీణ తపాలా ఉద్యోగులకు, పోస్ట్‌మాన్‌లకు ప్రోత్సాహకాలు అందించామని పోస్టల్ సూపరింటెండెంట్ జి.కిరణ్ తెలిపారు. స్థానిక పోస్టాఫీస్‌లో సోమవారం పోస్టల్ డివిజన్ ఎస్పీ కిరణ్ మాట్లాడుతూ ఐపిపిబిలో అందుబాటులో ఉన్న గాగ్ పాలసీ ఇన్సూరెన్స్, పిఎం కిసాన్ లబ్ధి, ప్రీమియం ఖాతాలు, నగదు లావాదేవీలు వంటి సేవలు వినియోగించుకోవాలని కోరారు. ఏఎస్పీ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న చిరు వ్యాపారులు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ మర్చంట్ క్యూఆర్ కోడ్ ద్వారా నగదు లావాదేవీలు వెంటనే జమవుతాయని తెలిపారు. ప్రొద్దుటూరు సౌత్ ఇన్‌స్పెక్టర్ సుశీల్ మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులు ప్రజలకు మరింత సేవలు అందించాలని కోరారు. ఐపిపిబి మేనేజర్ మారుతి మాట్లాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ సంపతి దివిజా

ఆదర్శ మహిళల స్ఫూర్తితో రాణించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

దేశాన్ని పాలించిన గొప్పగొప్ప మహిళలను ఆదర్శంగా తీసుకొని బాలికలు చదువులో రాణించాలని ఎంపిడిఒ సంపతి దివిజా అన్నారు. సోమవారం స్థానిక ఉర్దూ ఘర్ షాదీఖానాలో మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో చదివే 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశంతోపాటు పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యారంగంలో బాలికలు రాణించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కోరారు. కుటుంబంలో మహిళ చదువుకొని ఉంటే పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి పెడతారని తెలిపారు. బంగారు భవిష్యత్తు కోసం చదివే ముఖ్యమన్నారు. బాలికల్లో ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం ఉండాలని సూచించారు. ఎఇఒ జాఫర్ సాదిక్ మాట్లాడుతూ మధ్యలోనే చదువు ఆపరాదన్నారు. కార్యక్రమంలో ఎఇఒ-2 స్టాలిన్ ఐజాక్, రెడ్డెప్ప ఎంఇఒ, వీరారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ హరిత, ప్రభుత్వ వైద్యులు వైద్యనాథ్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు వాలంటీర్లకు సన్మానం

ఖాజీపేట : ఖాజీపేట ఎంపిడిఒ కార్యాలయంలో ఉత్తమ సేవలు అందించిన వాలంటీర్లను మంగళవారం ఉదయం సన్మానించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వెంకటసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరవుతారని తెలిపారు. వాలంటీర్లు తప్పక హాజరవ్వాలని ఆయన కోరారు.

గాలి, పక్షుల ద్వారా బర్డ్‌ఫ్లూ వ్యాధి సంక్రమణ

ఎర్రగుంట్ల : మాంసం విక్రయ దుకాణదారులతో సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య సమావేశం ఏర్పాటు చేశారు. స్థానిక పశు వైద్య సంచాలకులు డాక్టర్ మునెయ్య సమావేశంలో మాట్లాడుతూ చికెన్ ద్వారా కలిగే బర్డ్ ఫ్లూ వ్యాధిపై అవగాహన కల్పించారు. బర్డ్ ఫ్లూ వైరస్ కోళ్ల ద్వారా మనుషులకు సోకే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. పక్షులు, గాలి ద్వారా ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఈ వ్యాధి సోకకుండా సరైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మాంసం, కోడిగుడ్లు బాగా ఉడికించి తినాలని ప్రజలకు సూచించారు. ఆర్ఓ గంగిరెడ్డి, ఎఇ సురేష్ బాబు దుకాణదారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సచివాలయం, దుకాణంలో చోరీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయతీ పరిధిలోని వినాయక నగర్-2వ సచివాలయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. సోమవారం ఉదయం సచివాలయాన్ని శుభ్రం చేసే పనిమనిషి వచ్చేసరికి ఒకవైపు షట్టర్ తాళాలు పగలగొట్టి కొద్దిగా తెరిచి ఉండడంతో ఆమె సచివాలయ సిబ్బందికి, పోలీసులకు సమాచారమిచ్చారు. సచివాలయ సిబ్బంది వచ్చి చూడగా సచివాలయంలోని టేబుల్, తాళాలు పగలగొట్టి పేపర్లు చిందరవందరగా వేశారని, ఆధార్ కార్డు కేంద్రానికి సంబంధించిన లాప్ ట్యాప్ కనిపించడం లేదని.. ఇంటర్నెట్‌కు సంబంధించిన మోడెం పగిలిపోయి ఉందని గుర్తించారు. సచివాలయాన్ని ఆనుకొని ఉన్న దుకాణానికి ప్రధాన షట్టర్ తాళాలు పగలగొట్టి రూ.20 వేలు విలువైన సిగరెట్ డబ్బాలు, రూ.30 వేల నగదు, రూ. పదివేల సంపద చిల్లర దొంగలించుకున్నట్లు దుకాణ యజమాని మహమ్మద్ జాఫర్ తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. సచివాలయ సిబ్బంది, దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో పేదలు నివాసం ఉంటున్న సుందరయ్య నగర్ కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం డిమాండ్ చేసింది. మైదుకూరు మున్సిపల్ కార్యాలయం ముందు సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో కాలనీ ప్రజలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ మాట్లాడుతూ సుందరయ్య నగర్‌లో దాదాపు ఏడేళ్లుగా 150 కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. కాలనీకి ఇప్పటి వరకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాలనీలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. సిమెంట్ రోడ్లు, ఇళ్లకు విద్యుత్ మీటర్లు, డోర్ నెంబర్లను ఏర్పాటు చేయాలన్నారు. డికెటి పట్టాలు, ప్రభుత్వ పక్కా భవనాలు, అంగన్వాడీ సెంటర్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కమిషనర్ స్పందిస్తూ వెంటనే మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామని, మిగిలిన సమస్యలకు బడ్జెట్ కేటాయించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గురవయ్య, బీబీ, నాయకులు రవి, పోలయ్య. ఇమాం, సుధాకర్, రాజ, మగ్దుం గంగమ్మ, లక్ష్మీదేవి, థామస్, పుల్లయ్య, సుబ్బమ్మ, కవిత పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న సుందరయ్య నగర్ కాలనీ వాసులు

జగన్ పాలనలో అంతా విధ్వంసమే

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జగన్ పాలనలో అంతా విధ్వంసమేనని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఏ మూల చూసినా అభివృద్ధి లేదని ఆయన స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. 2019లో ప్రజలు ఇచ్చిన ఒక్కఛాన్సే జగన్‌కు చివరిదని పేర్కొన్నారు. ఓటమిపై జగన్‌కు స్పష్టత రావడంతో మళ్లీ ప్రజలను ఏమార్చడానికి పరదాలు కాస్త పక్కకు జరిపి ఎన్నికల ముందు రోడ్డెక్కాడని విమర్శించారు. రూ.10 ఇచ్చి రూ.100 దోచిన జగన్ సంక్షేమం గురించి చెప్పడమా అన్నారు. టిడిపి తెచ్చిన 120 సంక్షేమ పథకాలు రద్దు చేసిన జగన్ ప్రభుత్వాన్ని రద్దు చేయడానికి జనం కసితో ఉన్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్ల రూపాయలు దారి మళ్లించిన జగన్‌పై పేదలు యుద్ధానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మేనిఫెస్టోలో మద్య నిషేధం అని చెప్పి తర్వాత దాన్ని మద్య నియంత్రణ అని మార్చి రూ.1.50లక్షల కోట్ల మద్యం అమ్మిన జగన్ విశ్వసనీయత గురించి చెబితే జనం నమ్మాలా అని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో పొన్నతోట శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

సిఎం జగన్ మాటలు పచ్చి అబద్ధాలు : పిసిసి

వేంపల్లె : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభలో 99 శాతం హామీలను నెర వేర్చినట్లు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చెప్పిన మాటలు పచ్చి అబద్ధాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను 99 శాతం అమలు చేశానని చెప్పడం శోచనీయమన్నారు. ప్రతి రైతు కుటుంబానికి ప్రతి ఏటా పెట్టుబడి సాయం కింద రూ.12.500 ఇస్తానని మేనిఫెస్టోలో పేర్కొని అందులో రూ.5వేలు కోత విధించారని తెలిపారు. ఆరోగ్యశ్రీ అనారోగ్యశ్రీగా మారిందన్నారు. పిజి విద్యార్థులకు విద్యాదీవెన, వసతి దీవెన అమలు కావడం లేదని తెలిపారు. పేదలకు 25 లక్షల ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి 25 వేల ఇళ్లు కూడా నిర్మించలేదని విమర్శించారు. మద్యపాన నిషేధం అమలు చేయలేదన్నారు. 2019 ఎన్నికల అఫడవిట్ ప్రకారం దేశంలోని 30 మంది ముఖ్యమంత్రుల్లో అత్యంత ధనవంతుడు జగన్‌రెడ్డి అన్నారు. ఇప్పటి జగన్‌రెడ్డి ఆస్తివిలువ రూ.510 కోట్లు అని తెలిపారు. కానీ పేదవాడినని జగన్ చెప్పుకోవడం విడ్డూరమన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ఒక్కటి అమలు చేయలేదన్నారు. ఇకనైనా సిఎం జగన్ పచ్చి అబద్ధాలు చెప్పడం మానుకోవాలని హితవు పలికారు.

గెలుపోటములు ప్రజలే నిర్ణయిస్తారు : 'వరద'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గెలుపోటములు ప్రజాక్షేత్రంలో ప్రజలే నిర్ణయిస్తారని, ఏ పార్టీకి ఓటు వేసి ఏ అభ్యర్థిని గెలిపించాలో ప్రజలకు బాగా తెలుసునని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అభిప్రాయపడ్డారు. సోమవారం నెహ్రూ రోడ్డులోని ఆయన కార్యాలయంలో వరద విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి దేవాదాయ శాఖ భూమిలో రోడ్డు వేస్తే అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, చెన్నకేశవ స్వామి ఆలయ భూముల్లో రోడ్డు వేసి భూమిని స్వాహా చేసే ప్రయత్నం ఎమ్మెల్యే రాచమల్లు చేస్తున్నాడంటూ ఆరోపించారు. ఎమ్మెల్యే రాచమల్లు సోదరుడు మైలవరం కాలువ బంజరు భూమిని ఆక్రమించాడన్నారు. చౌటపల్లిలోని క్రిస్టియన్ల భూమిని దొంగ డాక్యుమెంట్లు సృష్టించి స్వాహా చేశాడు అంటూ ఆరోపించారు. 40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఏనాడు అవినీతి, అక్రమాలకు పాల్పడలేదన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు తనపై ఆరోపణలు చేయడం తగదన్నారు. అవినీతి అక్రమాలకు తాను పాల్పడినట్లు నిరూపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ ఎర్రన్న, వద్ది బాలుడు, శంకర్ నారాయణ, బాబు పాల్గొన్నారు.

సోషల్ మీడియా పాత్ర కీలకం : భూపేష్‌రెడ్డి

ముద్దనూరు : సోషల్ మీడియా ద్వారా వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి చంద్రబాబు విజన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జమ్మలమడుగు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్‌రెడ్డి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం భూపేష్ ఆధ్వర్యంలో సోషల్ మీడియాపై టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సోషల్ మీడియా పాత్ర ఎంతో కీలకమన్నారు. టిడిపి, జనసేన పార్టీ నాయకులు, శ్రేణులు సోషల్ మీడియా వేదిక ద్వారా క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని భూపేష్ కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండల అధ్యక్షులు శివరామిరెడ్డి, జనసేన నాయకులు జగదీష్, టిడిపి నాయకులు రాజశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి హాని : బిటెక్ రవి

వేంపల్లె : రాప్తాడు సిద్ధం సభలో ప్రతి కుటుంబానికి న్యాయం చేశానని జగన్ చెప్పాడని కానీ ప్రతి కుటుంబానికి ఆయన పాలనలోనే హాని జరిగిందని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం వేంపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పులివెందుల రోడ్డులోని ప్రతి దుకాణం వద్దకు వెళ్లి టిడిపి మేనిఫెస్టోలో అంశాలను వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి అధికారంలోకి వందశాతం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, జనసేన పులివెందుల ఇన్‌ఛార్జి హరిష్, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, జయచంద్రారెడ్డి, డివి సుబ్బారెడ్డి, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, గోగుల మల్లికార్జున, రామ గంగిరెడ్డి, పీరా సాహెబ్, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, అల్లాబకష్, ఈశ్వరయ్య, ఆది, రమణ, శివ, మహమ్మద్, డక్కా రమేష్, వేమా కుమార్, ఎస్వీ రమణ, రెడ్డి కిషోర్, నాగ సుబ్బయ్య, రవి కుమార్, రామాంజనేయురెడ్డి, మాజీ ఎంపిటిసి వెంకటయ్యతో పాటు పలువురు జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

పులివెందుల టౌన్ : వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచెయ్యడానికి జనం కసితో సిద్ధంగా ఉన్నారని కడప పార్లమెంట్ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి అక్కులుగారి విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎవరిది అభివృద్ధి పాలనో.. ఎవరిది విధ్వంస పాలనో ప్రజలకు తెలుసన్నారు. బూటకపు ప్రసంగాలు కాదు.. దమ్ముంటే వైసిపి నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాలు విసిరిరారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను రివర్స్ చేసి, రైతుల సబ్సిడీల నిలిపివేసిన జగన్‌కు అసలు రాయలసీమలో సభ పెట్టే అర్హతే లేదన్నారు. విలేకరుల సమావేశంలో లింగాల రైతు విభాగ అధ్యక్షులు రాఘవరెడ్డి, సీనియర్ నాయకులు గురివిరెడ్డి, యువ నాయకులు ప్రదీప్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కరస్పాండెంట్ రవికుమార్‌రెడ్డి

ఘనంగా న్యూ వికాస్ పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక కదిరి రోడ్డులో ఉన్న న్యూ వికాస్ ప్రయివేట్ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాలు ఎస్వీఎస్ఆర్ గార్డెన్‌లో సోమవారం కరస్పాండెంట్ రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు విద్య వ్యక్తులు మాట్లాడుతూ పట్టణంలో నూతనంగా అతికొద్ది కాలంలోనే మంచి విద్యను అందిస్తూ మంచి పేరు తీసుకువచ్చిన వికాస్ న్యూ స్కూల్ సిబ్బందిని అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

నాణ్యమైన విద్య బోధనే ధ్యేయం : మాజీ ఎమ్మెల్సీ

వేంపల్లె : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే సంసిద్ధ్ సతీష్‌రెడ్డి ఇంటర్నేషనల్ పాఠశాల ధ్యేయమని మాజీ ఎమ్మెల్సీ సతీష్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పులివెందుల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సంసిద్ధ్ సతీష్‌రెడ్డి ఇంటర్నేషనల్ పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల కోసం నూతనంగా సంసిద్ధ్ సతీష్‌రెడ్డి ఇంటర్నేషనల్ పాఠశాలను ప్రారంభించినట్లు చెప్పారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల చైర్మన్ శ్రీనువాసులురావు మాట్లాడుతూ సంసిద్ధ్ సతీష్‌రెడ్డి ఇంటర్నేషనల్ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి పరిపూర్ణతగల విద్యను అందిస్తామన్నారు. 2024-25 ఏడాదిలో నర్సరీ నుండి 7వ తరగతి విద్యా బోధన ఉంటుందని తెలిపారు. అడ్మిషన్లు ప్రారంభించామన్నారు. హాస్టల్ వసతి కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల డీన్ లలిత మాట్లాడుతూ మంచి విలువలు, క్రమ శిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాల కరస్పాం డెంట్ బీరం సుబ్బారెడ్డి, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీని వాసరెడ్డి(వాసు), కడప టిడిపి అభ్యర్థి మాధవి, పులివెందుల టిడిపి ఇన్‌చార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైసిపి, టిడిపి మండల కన్వీనర్లు చంద్రఓబుల్‌రెడ్డి, రామ మునిరెడ్డి, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, తొండూరు మాజీ జడ్పీటీసీలు శివమోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ ఎస్ఎఫ్ బాషా, వైసిపి నాయకులు వేల్పుల రాము, వైఎస్ మధురెడ్డి, చక్రాయపేట జడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి, ఆయా పార్టీల నాయకులు, ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా మహబూబ్ బాషా బాధ్యతలు

ముద్దనూరు : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సబ్ రిజిస్ట్రార్‌గా డి.మహబూబ్ బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ముద్దనూరు సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తూ డిప్యుటేషన్‌పై బద్వేలు వెళ్లారు. మళ్లీ అక్కడి నుంచి రెగ్యులర్ రిజిస్ట్రార్‌గా బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న వీర మృణాళిని దువ్వూరుకు బదిలీ అయ్యారు.

నిత్యావసర సరుకులు వితరణ

పులివెందుల టౌన్ : దివంగత జడ్పిటిసి తుమ్మల మహేశ్వరరెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ముద్దనూరు రోడ్డులోని పవర్ ట్రాక్ ట్రాక్టర్ షోరూంలో వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమానికి అభిషేక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మహేశ్వరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. మహేశ్వర్‌రెడ్డి సతీమణి ఉమాదేవి, కుమారుడు తుమ్మల హేమంత్‌రెడ్డి, కుమార్తె హేమలత సమకూర్చిన బియ్యం, నిత్యవసర సరుకులు 30మంది విభిన్నప్రతిభావంతుల కుటుంబాలకు పంపిణీ చేశారు. తుమ్మలపల్లె గ్రామంలో నిరు పేద కుటుంబాలకు నిత్యావసరవస్తువులు పంపిణీ చేశారు. అనాథ, మానసిక విభిన్న ప్రతిభావంతుల వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేశారు. విభిన్నప్రతిభావంతుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘు నాథరెడ్డి, తుమ్మల గంగాధర్‌రెడ్డి, ఈశ్వరమ్మ, గంగాధర్, హేమలత, బంధుమిత్రులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

సింహాద్రిపురం : లోమడలో నూతన సీతారాముల, శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించిన కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. నరసింహ కుమార్ శర్మ ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేశారు. గ్రామ ప్రజల ఆధ్వర్యంలో సీనియర్ ఎడ్లచే బండలాగుడు పోటీలను వైసిపి యువ నాయకుడు వైఎస్ అభిషేక్‌రెడ్డి ప్రారంభించారు. మొదటి బహుమతిగా రూ.80 వేలు, రెండో బహుమతిగా రూ.60 వేలు, మూడవ బహుమతిగా రూ.50 వేలు గెలుపొందిన ఎడ్ల యాజమానులకు అందజేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలను పులివెందుల రూరల్ సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో పులివెందుల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి రవీంద్రనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వేముల మండల పరిశీలకుడు వేల్పుల రాము, టిడిపి నాయకులు జయభరత్ రెడ్డి, జోగిరెడ్డి, స్థానికులు పవన్‌కుమార్‌రెడ్డి, రిషికేశవరెడ్డి పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పట్టాలు పంపిణీ

ఎర్రగుంట్ల : స్థానిక నగర పంచాయతీలోని 6వ సచివాలయం పరిధిలోని 12వ కౌన్సిల్ వారులో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు మున్సిపల్ వైస్ చైర్మన్ జై బున్నిసా సోమవారం పట్టాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన హామీ ప్రకారం పేదల సొంతింటి కలను నెరవేర్చారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, మునిసిపల్ చైర్మన్

అవినీతికి ఆస్కారం లేకుండా పథకాలు అమలు

ప్రజాశక్తి - మైదుకూరు

రాష్ట్రంలో అవినీతికి ఆస్కారం లేకుండా వాలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో వాలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు రూ.2 లక్షల 62 వేల కోట్లు వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు చేరిందన్నారు. వాలంటరీ వ్యవస్థ వచ్చిన తర్వాత ఎక్కడే గాని అవినీతికి ఆస్కారం లేదన్నారు. నేడు రాష్ట్రంలో ప్రతిపక్షం కూడా అవినీతిపై ప్రశ్నించడం లేదన్నారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు, ధ్రువీకరణ పత్రాలు కావాలన్నా వాలంటీర్ ద్వారానే అందుతున్నాయన్నారు. కరోనా మహమ్మారి సమయంలో కూడా వాలంటీర్లు ప్రజలకు సేవ చేశారన్నారు. వాలంటీర్లకు సేవరత్న, సేవా వజ్ర అవార్డులను ప్రదానం చేశారు. మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియ్యా, ఎంపిడిఒ రఘురామిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ రఘు, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, స్థానిక నాయకులు, అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చాపాడు : సంక్షేమ పథకాల అమలు, అర్హుల గుర్తింపు, పంపిణీలో కీలక పాత్ర వాలంటీర్లదేనని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్ కల్యాణ మండపంలో సోమవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రతి 50 కుంటుంబాలకు ఒక వాలంటీర్‌ను నియమించి ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చారన్నారు. సేవ రత్నం నాగసుధ (మడూరు), రావీన (బద్రిపల్లె), రెడ్డమ్మ (లక్ష్మిపేట), రహీమూన్ (ఖాదర్‌పల్లె), భార్గవి (చియ్యపాడు)కి అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్షుమయ్య, ఎంపిడిఒ మహబుబ్ బీ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, సచివాలయ కన్వీనర్ల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ భర్త శాంతరాజు, నారాయణరెడ్డి, గంగులయ్య, వెంకటరెడ్డి, మాధవ్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, జయసుబ్బారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లింగాల : మండలంలో పనిచేస్తున్న వాలంటీర్లకు సోమవారం పురస్కారాలు అందజేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మీదేవి, ఎంపిడిఒ జ్యోతిష్ణ, కడప పార్లమెంటు సెక్రటరీ సారెడ్డి చంద్రశేఖర్‌రెడి, డిప్యూటీ తహశీల్దార్ ప్రభంజన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆలమూరు జగన్‌మోహన్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వైసిపిలో 50 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కొండాపురం మండలం ఎస్.తిమ్మాపురం గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి సమక్షంలో సోమవారం 50 కుటుంబాలు చేరాయి. ముందుగా ఎమ్మెల్యేకు వైసిపి కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ ముందుగా అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు జగనన్న సంక్షేమ పథకాలను చూశారు.. వచ్చే ఎన్నికల్లో మళ్లీ మన ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందన్నారు. తర్వాత సంక్షేమం, అభివృద్ధి రెండింటిని సమన్వయంగా తీసుకొని వెళ్లడానికి జగన్మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు. జగనన్న గెలుపును రాప్తాడు సిద్ధం సభ రాష్ట్ర ప్రజలకు చూపించిందన్నారు. తిమ్మాపురం గ్రామంలో మీరందరూ ఏకమై తనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించి జగనన్నను ముఖ్యమంత్రిగా బలపరచాలని సుధీర్‌రెడ్డి కోరారు. పార్టీలో చేరిన వారు ఆలమూరు శ్రీనివాసులరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, లింగిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఒంటెద్దు రామలింగారెడ్డి, రామలింగేశ్వరరెడ్డి (తాడిపత్రి బాబు)తో కలిసి 50 కుటుంబాలున్నాయి. పొట్టిపాడు రాజారెడ్డి, నవజ్యోతి రెడ్డి, అనంతపురం పెద్దిరెడ్డి, రామిరెడ్డిపల్లి సర్పంచ్ సుదర్శనరెడ్డి, జడ్పీటీసీ శేఖర్ పాల్గొన్నారు

ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

ప్రజాశక్తి - వేంపల్లె

రాప్తాడు బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసిపి నాయకులు, కార్యకర్తలు దాడి చేయడం అమానుషమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. **ఖాజీపేట :** రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసిపి అల్లరిమూకలు దాడి చేయడం దుర్మార్గమని టిడిపి మండలశాఖ అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మి రెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనారిటీ నాయకులు కమలాపురం ఫరూక్ అహ్మద్, సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, నియోజకవర్గం బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తుట్టే రాము యాదవ్ తీవ్రంగా ఖండించారు. **జమ్మలమడుగు రూరల్ :** రాప్తాడు సిఎం సిద్ధం సభలో ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలని జమ్మలమడుగు ప్రెస్‌క్లబ్, కాంగ్రెస్, జనసేన, సిపిఎం, సిపిఐ, ఎస్ఎఫ్ఐ, ఆర్‌డిఎస్ తదితర ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. డిఎస్పి యస్వంత్‌కు ఫిర్యాదు చేశారు. అంతకుముందు ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒకు వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత వెంకటస్వామి, జనసేన కో-ఆర్డినేటర్ నల్లంసెట్టి నాగార్జున, సిఐటియు విజయ్, వినయ్, పాత్రికేయులు పాల్గొన్నారు. **మైదుకూరు :** మీడియా ప్రతినిధులపై వైసిపి కార్యకర్తల దాడిని మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. మీడియా ప్రతినిధుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి ప్రతిపత్రాన్ని సమర్పించారు. తహశీల్దార్‌కు వినతిపత్రమిచ్చారు. ర్యాలీలో టిడివి, జనసేన, సిపిఐ, సిపిఎం, విలేకరులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** ఫొటో జర్నలిస్ట్‌పై వైసిపి మూకల మూకుమ్మడి దాడిని ఖండిస్తూ ప్రొద్దుటూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి పాత్రికేయులు నిరసన చేశారు. సిపిఎం, టిడిపి, బిజెపి, జనసేన, సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు మద్దతు పలికారు. రెవెన్యూ కార్యాలయం నుండి రాజీవ్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. **ముద్దనూరు :** ఆదివారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సిద్ధం బహిరంగ సభలో ఎలక్ట్రానిక్ మీడియా ఫొటోగ్రాఫర్‌పై అల్లరి మూకలు దాడి చేయడం అమానుషమని స్థానిక విలేకరులు ఖండించారు. నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ సువర్ణదేవికి వినతిపత్రం అందజేశారు.

సమాచారం లేకుండా ఎలా రద్దు చేస్తారు

- ఆప్ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా

ప్రజాశక్తి - వేంపల్లె

జగనన్న కాలనీలో ప్రభుత్వం లబ్ధిదారునికి ఇచ్చిన ఇంటి స్థలం పట్టాను రద్దుచేసి ఇతరులకు ఎలా కేటాయిస్తారని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లె సచివాలయం-4 పరిధికి చెందిన లబ్ధిదారుడైన షేక్ షఫీ, జమీలాకు చింతలమడుగుపల్లి జగనన్న లేఔట్‌లో సర్వే నెం.1385, ప్లాట్ నెం.242లో ఇంటి స్థలాన్ని ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆ మేరకు పట్టా ఇచ్చి మళ్లీ ఇతరులకు ఆ స్థలాన్ని కేటాయించారన్నారు. లబ్ధిదారుడికి ఎలాంటి సమాచారం, నోటీసు ఇవ్వకుండా వారి పేరుపైన ఉన్న ఇళ్ల పట్టాను రెవెన్యూ అధికారులు రద్దు చేశారన్నారు. దీనిపై తను స్థానిక తహశీల్దార్‌ను ఈ విషయాన్ని వివరణ కోరగా.. కేవలం ఎన్నికల విధులకు ఇక్కడికి వచ్చానని, తాను ఏమీ చేసేది లేదని చెప్పినట్లు తెలిపారు.